


# కరపత్రం

SINCE 2014

శనివారం మార్చి 21, 2026 సంపుటి : 2 సంచిక : 159 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4



# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

**ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు**

- రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు
- మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు
- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయింపు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు,
- రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- మహాలక్ష్మి పథకం.. రూ.4,305 కోట్లు

**హైదరాబాద్,మార్చి20 :**
తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. 'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.

వివరాలు 2 లో..

# ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

**హరీస్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం**

**పదో తరగతి పరక్షలు లేకుండా 12 తరగతులు**

- తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు
- కమిటీ అధ్యయనం తరవాత విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పులకు చెల్లించాం
- కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన కేటీఆర్, హరీష్ రావు
- హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం
- డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు
- మీడియతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి 20 :**
ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్ట్‌లు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు.

2 లో



# రాష్ట్రంలో ఎల్‌పిజి సమస్య రాకుండా చూడాలి

- పత్యామ్నాయాలపై దృష్టి పెట్టాలి: చంద్రబాబు

**అమరావతి,మార్చి 20**
రాష్ట్రంలో ఎల్పీజీ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ, ఈవీ, ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు.



# బడ్జెట్ లో నిరుద్యోగుల ప్రస్తావన ఏది: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

తెలంగాణ బడ్జెట్ 2026-27పై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్ లో నిరుద్యోగుల ప్రస్తావనే లేదని విమర్శించారు.బడ్జెట్ ప్రజాసంక్షేమానికి వ్యతిరేకంగా, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేలా ఉందని ఆమె విమర్శించారు. ప్రతి వ్యక్తిపై రూ. 2.16 లక్షల అప్పు భారం పడుతుందని ఆరోపిస్తూ,

# బీఆర్ఎస్ యువరాజు డ్రగ్స్ దందా నడుపుతుండు: పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్:**
రాష్ట్రంలో బీఆర్ఎస్ యువరాజు డ్రగ్స్ దందా నడిపిస్తున్నాడని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం (మార్చి 20) ఆయన గాంధీ భవన్?లో మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలు డ్రగ్స్ దందాపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకుంటున్నాయన్నారు. డ్రగ్స్ నిర్మూలన బీజేపీకి ఇష్టం లేదా అని నిలదీశారు. బీఆర్ఎస్ నేతల దగ్గర డ్రగ్స్ దొరికితే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



మాట్లాడారని విమర్శించారు. ఇక, బీసీల గురించి మాట్లాడే అర్హత బీజేపీకి లేదన్నారు. బీజేపీలో బీసీలకు దక్కుతున్న గౌరవం ఏంటని ప్రశ్నించారు. సికింద్రాబాద్ సీటు బీసీ లీడర్ దత్తాత్రేయ నుంచి కిషన్ రెడ్డి లాక్కున్నారు. అలాగే దత్తాత్రేయ గవర్నర్ పదవిని ఇంద్రసేనా రెడ్డి లాక్కున్నారని అన్నారు. బీసీ నేత దత్తాత్రేయకు బీజేపీలో గౌరవం ఏదని ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తొక్కిపట్టిందే బీజేపీ అని అన్నారు. కాంగ్రెస్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీసీలకు పెద్ద పీట వేశామని చెప్పారు.

# బిసిలను మోసం చేసిన బడ్జెట్

» ఇచ్చిన హామీ మేరకు దక్కని కేటాయింపులు

» బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**హైదరాబాద్,మార్చి 20:1**
ప్రభుత్వం బీసీల గొంతు కోసిందని.. వారిని మోసం చేసిందని,ఇచ్చిన హామీ మేరకు కేటాయింపులు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆరోపించారు. తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.



2లో..

## అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

» దెబ్బతిన్న పలు రకాల పంటలు

» భారీగా నష్టపోయామని ఆందోళన

» రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్నాయుడు

**అమరావతి,మార్చి20 :**
అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.



2లో..

## చెవిలో పూలు పెట్టిన భట్టి బడ్జెట్

» అన్ని వర్గాలను విస్మరించిన కేటాయింపులు

» బిఆర్ఎస్ ఎమ్మెల్యేల చెవిలో పూలతో విమర్శలు



**హైదరాబాద్,మార్చి20 :**
బడ్జెట్ మొత్తం మోసమని, అన్ని వర్గాల ప్రజల చెవిలో కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వులు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసే తీయలేదని మండిపడ్డారు.

2లో..

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

- అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ
- బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు



**హైదరాబాద్,మార్చి 20 :**
అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు.

## బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం



- ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు
- మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది
- భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు

**హైదరాబాద్,మార్చి20 :**
తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి ఃరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పింఛన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు.

02

మిగతాది 2లో



## మరోమారు పెరిగిన బంగారం ధరలు

## ఆరు గ్యారెంటీలకు మంగళం పాడిన బడ్జెట్

- అంకెల గారడీతో బురిడీ కొట్టిచారు
- మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

**నిజామాబాద్,మార్చి 20 :**
తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీగా ప్రజలను మోసం చేసేదిగా ఉందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.



మిగతాది 2లో

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు

మొదటిపేజీ తరువాయి

రాబోయే 3-4 రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళ్లు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెటట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ, గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లిలో వడగండ్ల వానకు కర్బూజ పంట ధ్వంసమైంది. తిరుపతి జిల్లాలో 1070 ఎకరాల్లో అరటి, వరి, తమలపాకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు సుమారు రూ.10.25 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో గురువారం జల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకోడానికి రైతులు శ్రమించాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వడగళ్లు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూత, పిందె దశలో ఉన్న మామిడి పంటకు నష్టం వాటిల్లింది. కాపు దశలో ఉన్న జీడిమామిడి సైతందెబ్బతిందని రైతులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 వరకు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం కోస్తాలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు అక్కడక్కడ పిడుగులతో పాటు మోస్తరు వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.

# బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీశ్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. మేడారం టెండర్లలో స్కాం జరిగిందని మంత్రి బిడ్డ స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. గురుకుల పిల్లలకు కడుపు నిండా అన్నం పెట్టలేని సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేమో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ అంటున్నారని దెప్పిపొడిచారు. పెట్టుబడుల విషయంలో ప్రభుత్వానివి కట్టుకథలని విమర్శించారు. అక్రమ సంపాదన దాచుకోవటానికే ముఖ్యమంత్రి విదేశీ పర్యటనలు చేస్తున్నారని ఆరోపించారు. మూడుసార్లు రైతుబంధు ఎగొట్టినందుకు రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలన గాడి తప్పటం వలనే తలసరి ఆదాయం తగ్గిందని అన్నారు. పారిశ్రామికవేత్తలకు తుపాకులు పెట్టి మాముళ్లు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి యాదాద్రిని మూసేస్తామంటే.. భట్టి ఏమో యాదాద్రి తెలంగాణకు గర్వకారణమని అంటున్నారని అన్నారు. సింగరేణి గురించి కాంగ్రెస్‌కు మాట్లాడే హక్కు లేదన్నారు. సింగరేణిని కుంభకోణాల గనిగా మార్చారని హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తరిగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించ డమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి ధీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందచేస్తారు. ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం ఇస్తారు. రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన చేపట్టారు.. కేటాయింపులను పరిశీలిస్తే.. వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య శాఖకు రూ.13,679 కోట్లు, కార్మిక శాఖకు రూ.998 కోట్లు, మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు, పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు, ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు, బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు, మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు, కల్యాణ లక్ష్మీ పథకం.. రూ.3,683 కోట్లు, ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు, యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు, ఉస్మానియా యూనివర్సిటీ కి రూ.వెయ్యి కోట్లు, మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు, మహాలక్ష్మీ గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు, గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు, వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు, మహాలక్ష్మీ పథకం.. రూ.4,305 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు, ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటయిస్తున్నట్లు భట్టి ప్రకటించారు.

# ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

మొదటిపేజీ తరువాయి

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్టు టీడీఆర్ భూ బదలాయింపుల పై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్టులో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు. భూముల అమ్మకానికి కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని సీఎం స్పష్టం చేశారు. భూములు అమ్మితే వచ్చిన డబ్బులను సొంతానికి వాడుకోవడానికి తాము వ్యతిరేకమన్నారు. మూసీ విషయంలో ఆగేది లేదన్నారు. నష్టపోయిన వారిని ఎలా ఆదుకోవాలో ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటామని తెలిపారు. ఢిల్లీకి ఎన్నిసార్లు వెళ్లానో లెక్కపెట్టిన వాళ్లు తాను ఎన్ని నిధులు తెచ్చానో కూడా లెక్కపెట్టాలని హితవు పలికారు. గాంధీ మనుమడు కూడా ఒక పౌరుడేనని.. ప్రస్తుతం ఆయనా బీఆర్ఎస్ ట్రాప్‌లో పడ్డారని అన్నారు. గాంధీ విగ్రహం పెట్టొద్దని అనడం సరికాదని, గాంధీ దేశానికి ఆదర్శపురుషుడని అన్నారు. డ్రగ్స్ అంశంలో ఇంత జరుగుతుంటే.. బీజేపీ నేతలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలను తిడితే బీజేపీ ఎందుకు మాట్లాడుతోందని నిలదీశారు. ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే ముఖ్యమంత్రిని ఎన్నుకుంటారని అన్నారు. తనను సీఎంగా అంగీకరిస్తున్న మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. జీవన్ రెడ్డి అంశాన్ని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చూసుకుంటారన్నారు. ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వానిది.. తమది కాదని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యావ్యవస్థలో సమూలంగా మార్పులు తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దీనిపై కమిటీ అధ్యయనం చేస్తోందన్నారు. మార్పులపై కమిటీ నివేదికే ఫైనల్ కాదన్నారు. జాతీయస్థాయి అధ్యయనం తర్వాత మార్పులు తీసుకురాబోతున్నట్లు చెప్పారు.

## మరోమారు పెరిగిన బంగారం ధరలు

మొదటిపేజీ తరువాయి

మధ్య ప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం భారీగా పతనమైన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా కోలుకుంది. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.650ల మేర పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.600ల మేర పెరిగింది. వెండి ధర మాత్రం తిరోగమనంలో కొనసాగుతూ మరో రూ.5 వేల మేర తగ్గింది (ఉనీటె, ఞాతిలెః ఖసతిఇాఃబ నీని ఓజీసఇఠ 20). గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,930కు పెరిగింది. నిన్నటితో పోలిస్తే ధర రూ.650ల మేర ఎగబాకింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.600ల మేర పెరిగి రూ.1,38,350కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం దాదాపుగా నిన్నటి స్థాయిలోనే కొనసాగుతోంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2,64,900గా ఉంది. ఇతర ప్రధాన నగరాల వారీగా చూస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,630గా ఉంది. ఢిల్లీలో రూ.1,51,080గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,50,930గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ బంగారం ధర రూ.1,38,990గా ఢిల్లీలో రూ.1,38,500 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,38,350గా ఉంది. దేశంలోని పలు నగరాల్లో వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి చెన్నైలో రూ.2,64,900గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో కిలో వెండి రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. ఇకపోతే మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం అద్భుతమైన రికవరీని సాధించాయి. ఆరంభంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లు, నిఫ్టీ 23,300 పాయింట్ల మార్కును దాటి దూసుకుపోయాయి. గత కొన్ని రోజులుగా పడుతున్న మార్కెట్లలో షేర్లు తక్కువ ధరకే లభిస్తుండటంతో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఆఎఐఐ), రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు చేపట్టారు. మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లకు బలాన్ని ఇచ్చింది. ఇది భారత మార్కెట్లలో కూడా ఉత్సాహాన్ని నింపింది. ఈ రోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ రంగాలు అగ్రగామిగా నిలిచాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ వంటి బ్లూ-చిప్ షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపిస్తున్నాయి.

## చెవిలో పూలు పెట్టిన భట్టి బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ సర్కారోళ్లు ఈ బడ్జెట్ పెట్టుకున్నరని ఆరోపించారు. ఈ మేరకు గంగుల కమలాకర్, వివేకానందలో కలసి చెవిలో పూలతో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బ్జడెట్‌లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు. ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ఆడబిడ్డలను దగా చేయడమేనని మండిపడ్డారు. వృద్ధ్యాప్య పింఛన్‌లు, వికలాంగ పింఛన్‌ల విషయంలో కూడా ప్రభుత్వం మాటతప్పిందని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులు రూ.6 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆగ్రహించారు.

## బిసిలను మోసం చేసిన బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీలకు కేటాయించాల్సిన రూ.20 వేల కోట్ల బడ్జెట్ ఎటు పోయిందని ప్రశ్నించారు. తులం బంగారం ఇస్తామని ఇవ్వకుండా చెవిలో పూలు పెట్టారని విమర్శించారు. ప్రభుత్వ డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చిందని మంత్రి ప్రకటించారని.. ఇప్పుడేమో కేసీఆర్ కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల బ్జడెట్‌లో కోతల విధించారని.. ఇంతలా కోతల విధించిన బ్జడెట్‌ను ఇప్పుడే చూస్తున్నానని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవ భూములను లాగే ప్రయత్నాలు చేస్తున్నారని.. బీసీల చెవిలో పువ్వులు పెట్టి మోసం చేశారని ఆరోపించారు. త్వరలోనే బీసీల ఆగ్రహం చూస్తారని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

మొదటిపేజీ తరువాయి

'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో ఎల్‌పిజి సమస్య రాకుండా చూడాలి

మొదటిపేజీ తరువాయి

గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినక ముందే అప్రమత్తం కావాలని ఆదేశించారు. ఎల్పీజీ సరఫరాలో విద్యా సంస్థలు, ఆలయాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎల్పీజీ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. పెట్రోల్, డీజిల్, ఎరువులకు లోటు రాకుండా కేంద్రంతో మాట్లాడాలన్నారు.మరోవైపు అకాల వర్షాలతో పంట నష్టంపై కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు తెలుసుకున్నారు. 12 జిల్లాల్లో మొక్కజొన్న, వరి, మినపకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. దీని విలువ దాదాపు రూ.40 కోట్లుగా ఉంటుందని అన్నారు. 9 జిల్లాల్లో అరటి, బొప్పాయి, మిరప, మామిడి, బత్తాయి, నిమ్మకు నష్టం వాటిల్లిందని, దీని విలువ రూ.22.68 కోట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు.

## ఆరు గ్యారెంటీలకు మంగళం పాడిన బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

బడ్జెట్‌తో తో ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. మహిళలు,పేద ప్రజలను, నిరుద్యోగులను వంచించిన బ్జడెట్ అని ఆరోపించారు. ఆరు గ్యారంటీలకు మంగళం పాడిన బడ్జెట్ అని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే స్కీమ్‌లకు సరైన కేటాయింపులు లేవని, అవినీతి అవకాశాలు ఉన్న ప్రాజెక్టులకు భారీ నిధులు కేటాయించారని వెల్లడించారు.గత సంవత్సరం బడ్జెట్ అంచనాలను ఈ ప్రభుత్వం అందుకోలేక పూర్తిగా విఫలమైందని ఇప్పటికే స్పష్టమైందని అన్నారు. అయినా కూడా మళ్లీ అదే విధంగా అంకెల మాయాజాలంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని అన్నారు.

కోటి 58 లక్షల మహిళలకు ఇస్తానన్న రూ. 2,500 చేయూత పథకం ప్రస్తావనే లేదు. వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు పెన్షన్‌ను రూ. 4 వేలకు పెంపు కేటాయింపులు లేవు.తులం బంగారం హామీ పూర్తిగా మర్చిపోయారు.జాబ్ క్యాలెండర్‌ను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు.

రైతు భరోసా పేరుతో హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు మూడు పంటలకు ఎగ్గొట్టారని,ఆచరణ కు సాధ్యం కానీ రాజీవ్ యువవికాసానికి మాత్రం బ్జడెట్ లో ప్రతి సారి కేటాయింపులు చేస్తూ వస్తున్నారని ఆరోపించారు.ఈ ప్రభుత్వానికి భూములపై ఉన్న ప్రేమ, ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదని తెలిపారు.

## బడ్జెట్ లో నిరుద్యోగుల ప్రస్తావన ఏది: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ హామీల అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతు రుణమాఫీ, ఆరు గ్యారెంటీల అమలుకు బడ్జెట్‌లో స్పష్టమైన కేటాయింపులు లేవని ఇది ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. బడ్జెట్ పేదలకు, సామాన్యులకు భారం పడేలా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది కేవలం అంకెల గారడీ బడ్జెట్ అని అన్నారు. జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత. స్కిల్ వర్సిటీ అంటూ సర్కార్ డబ్బా కొట్టుకుంటోంది.. స్కిల్ వర్సిటీ కి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఆరు గ్యారంటీలకు ఊసే లేదన్నారు. తెలంగాణలో ప్రజల ఆహారంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది.. రాష్ట్ర వ్యాప్తంగా ఫుడ్ కల్తీ జోరుగా జరుగుతోంది.. తనిఖీలు, కేసులతోనే ప్రభుత్వం సరిపెడుతోంది.. ఫుడ్ కల్తీ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## ఐ డి బి ఐ కార్పొరేట్ ఆఫీసర్స్ రేకుర్తి సందర్శన

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ మార్చి 20**



ఐ డి బి ఐ కార్పొరేట్ ఆఫీసర్స్ జానకిరామన్ సిజిఎం, వెంకటేశ్ డిజీఎం, శ్రీనివాస్ ఐ డి బి ఐ మేనేజర్, శ్రీధర్ కోలిపాక రేకుర్తి వైద్యశాలను సందర్శించారు. ఈ మధ్యకాలంలో ఐ డి బి ఐ నుండి 70,20,800 సిఎస్ఆర్ గ్రాంట్ క్రింద మాడ్యులర్ థియేటర్స్ కన్స్ట్రక్షన్కు , పేషంట్స్ ట్రాన్స్పోర్టేషన్ గాను బస్సు దానం చేయడం జరిగింది. డబ్బును ఖర్చుపెట్టిన విధానం పరిశీలించడాని, వారిచ్చిన డబ్బు ద్వారా నిర్మించిన ఆపరేషన్ థియేటర్స్ ప్రారంభం చేశారు. చైర్మన్ కొండ వేణు మూర్తి మాట్లాడుతూ లాసిక్ మిషన్ సుమారుగా 4కోట్ల సహాయం అందించవలసిందిగా కోరారు. జానకి రామన్ చీఫ్ జనరల్ మేనేజర్ సానుకూలంగా స్పందించి వచ్చే ఆర్థిక సంవత్సరంలో పరిశీలిస్తామని మాటిచ్చారు. ఈ కార్యక్రమంలో చిదుర సురేశ్, ప్రకాశ్ హోల్, ఇంజనీర్ కోల అన్నా రెడ్డి, ముక్క శరత్ కృష్ణ, మ్యాడమ్ శివకాంత్ మరియు సింగంరాజు, ప్రవీణ్ చావ్లా హాజరయ్యారు

## 11 ఇంక్లైన్ లో ఒక్క రోజులో రికార్డు స్థాయి ఓ ఉత్పత్తి



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 20:**
ఆర్జి 1లోని జిడికె 11 ఇంక్లైన్ భూగర్భ గనిలో ఒక్క రోజులో రికార్డు స్థాయి ఉత్పత్తి నమోదైంది మొత్తం ఉత్పత్తి లక్ష్యం 2916 టన్నులు కాగా, దాన్ని అధిగమించి 4025 టన్నుల ఉత్పత్తి చేసి 138 శాతం సాదించారు. ఇది 2025-26 ఆర్థిక సంవత్సరములో సంస్థ లోని అన్ని భూగర్భ గనులలో అత్యధిక రోజువారి ఉత్పత్తిగా నమోదైంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అర్జీ 1 జియం డీ లలిత్ కుమార్ జిడికే జిడికె 11 ఇంక్లైన్ గనిని సందర్శించి ఇట్టి విజయానికి కారణమైన అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, సూపర్వైజర్లు, సహకరించిన యూనియన్ నాయకులను ప్రత్యేకంగా అభినందించి అందరికి స్వీట్స్ పంపిణి చేసారు. ఈ సందర్బంగా జియం మాట్లాడుతూ భూగర్భ గనిలో యంత్రాలు సుమారు 20 గంటల పాటు నిరంతరం పని చేయడం వలన ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయని, ముఖ్యంగా కంటిన్యూస్ మైనర్ 2వ విభాగం 200 శాతం లక్ష్యాన్ని సాధించడం గొప్ప విశేషం అని తెలిపారు. ఈ విజయానికి కారణమైన ఆపరేటర్లు, టెక్నిషియన్స్, సూపర్ వైజర్లు, అధికారులు, కాంట్రాక్టర్లు, గనిలోని అన్ని ఉద్యోగుల సమిష్టి కృషి కారణమని జియం కొనియాడారు. ఈ సందర్బంగా మరమ్మత్తులు చేసిన జిడికే 11వ గని మేనేజర్ కార్యాలయమును ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, గని ఏజంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం, గ్రుఫ్ ఇంజనీర్ రాందాస్, డిప్యూటి పర్సనల్ మేనేజర్ వేణు, రక్షణ అధికారి మల్లేష్, ఫిట్ ఇంజనీర్ రాకేష్, ఎఐటియుసి నాయకులు రంగు శ్రీను, ఫిట్ సెక్రటరి, నాయిని శంకర్, ఫ్రీ షిఫ్ట్ ఇంచార్జ్ క్రాంతి, సూపర్వైజర్ వేణు, ఆపరేటర్స్ శ్రీనివాస్, అశిష్, అశోక్, ప్రసాద్ అధికారులు ఉద్యోగులు, సూపర్ వైజర్ స్టాఫ్ పాల్గొన్నారు.

## కష్టానికి తగ్గ గుర్తింపు..

**- దీటి బాలరాజ్ కు అత్యున్నత పదవి**
**- జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గా నియామకం**



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని మార్చి 20:**
కష్టానికి తగ్గ గుర్తింపు వచ్చింది.. దీటి బాలరాజ్ కు అత్యున్నత పదవి లభించింది.. జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ నియామకం చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ ఉన్నత పదవిని చేపట్టడం మా అందరికీ ఎంతో గర్వకారణం అని కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలుపుతున్నారు. మీ అంకితభావం, కఠోర శ్రమ, మీలోని నాయకత్వ లక్షణాలే మిమ్మల్ని ఈ స్థాయికి చేర్చాయి. నిరంతరం నేర్చుకుంటూ, ఎదుటివారికి స్ఫూర్తినిచ్చే మీ వ్యక్తిత్వం మరెందరికో ఆదర్శం. ఈ నూతన బాధ్యతల్లో మీరు మరిన్ని విజయాలు అందుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పదవి మిమ్మల్ని వెతుక్కుంటూ రాలేదు, మీ ప్రతిభే ఆ పదవిని సాధించింది. మీరు చేపట్టిన ఈ ఉన్నత పదవి మీ కృషికి లభించిన నిజమైన గౌరవం." స్ఫూర్తిదాయక ప్రయాణం. "మీ ప్రయాణం ఎంతో మందికి ఒక పాఠం. అంచలంచెలుగా ఎదుగుతూ మీరు అందుకున్న ఈ శిఖరం మా అందరికీ స్ఫూర్తిదాయకం." శుభాకాంక్షలు: "మీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరిన్ని మైలురాళ్లను అధిగమిస్తుందని ఆశిస్తూ, శుభాకాంక్షలు.. తనకు పదవి రావడం పట్ల ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్, పార్టీ నాయకులకు దీటి బాలరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీవారికి 20 లక్షల విరాళం అందచేత

తితిదే ట్రస్టులకు రూ.20 లక్షల విరాళం అందింది. తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు కుమారుడు అరణి మదన్ మోహన్ తమ జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరపున తితిదే శ్రీ వేంకటేశ్వర గో సంరక్షణ ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలను విరాళంగా అందించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన ముత్తా గౌతమ్ దంపతులు తితిదే శ్రీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలను విరాళంగా అందించారు. ఈ మేరకు దాతలు శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో తితిదే ఈవో ముద్దాడ రవిచంద్రకు విరాళం డీడీలను అందజేశారు.

## రంజాన్ పండుగ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కి రెండు రోజుల సెలవు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మర్చి 20**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ఒక అధికారిక ప్రకటనలో మాట్లాడుతూ సమస్త రైతు సోదరులు, అక్తి పత్తి ఖరీదు వ్యాపారస్తులు, గుమస్తాలు, హమాలీలు, దాడువాయి కార్మికులు, ట్రాక్టర్ మరియు ట్రాలీ డ్రైవర్లకు ముఖ్య సమాచారం తెలియజేశారు.
ప్రస్తుతం సాగు కాలం దృష్ట్యా మార్కెట్ యార్డుకు పెద్ద ఎత్తున వ్యవసాయ ఉత్పత్తులు తరలివస్తున్న నేపథ్యంలో, అందరికీ ముందస్తుగా సమాచారం అందించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం




ప్రకటించిన సెలవులను అనుసరించి జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డుకు వరుసగా రెండు రోజుల పాటు సెలవులు ఇవ్వబడినట్లు తెలిపారు. తేది: 21.03.2026 (శనివారం) -- రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు
తేది: 22.03.2026 (ఆదివారం) -- సాధారణ వారాంతపు సెలవు ఈ రెండు రోజులలో మార్కెట్ యార్డు పూర్తిగా మూసివేయబడుతుందని, ఎలాంటి కొనుగోలు--అమ్మకపు కార్యకలాపాలు జరగవని స్పష్టం చేశారు. అలాగే హమాలీలు, గుమస్తాలు, కార్మికులు వ్యాపారస్తులు ఈ విషయాన్ని గమనించి తమ పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. మరియు రైతులు తమ పత్తి, అక్తి మరియు ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఈ సెలవు రోజుల్లో మార్కెట్ యార్డుకు తీసుకురాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలా చేయడం వల్ల అనవసరంగా ఇబ్బందులు, రవాణా ఖర్చులు మరియు నిల్వ సమస్యలు ఎదురుకాకుండా ఉంటాయని పేర్కొన్నారు. తిరిగి 23.03.2026 (సోమవారం) నాడు మార్కెట్ యార్డు యథావిధిగా ప్రారంభమవుతుందని, ఆ రోజునుంచి అన్ని లావాదేవీలు సాధారణంగా కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం రైతు సోదరులందరికీ సహకారం అందించాలని కోరుతూ, మార్కెట్ వ్యవస్థను సజావుగా కొనసాగించేందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.?

## రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లింలకు ఈద్ కానుకల పంపిణీ

**కరపత్రం ప్రతినిధి వీణవంక మార్చి 20**
కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని పలు గ్రామాలలో రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లిం కుటుంబాలకు ఈద్ కానుకల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అర్హులైన లబ్ధిదారులకు గిఫ్ట్ ప్యాక్లు అందజేశారు. ఈ కానుకలలో పండుగకు అవసరమైన నిత్యావసర వస్తువులు ఉండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.
వీణవంక మండల కేంద్రంలో మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి సాహెబ్ హుస్సేన్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ముఖ్యంగా పేద ముస్లిం మహిళలకు ఈద్ కానుకలను అందజేయడం ద్వారా వారికి పండుగ సంతోషాన్ని పంచిపెట్టారు. కార్యక్రమం సందర్భంగా మహిళలు, వృద్ధులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ సందర్భంగా ఎండి సాహెబ్ హుస్సేన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం అందించడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ముస్లిం మైనారిటీల అభివృద్ధికి



ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు.
అలాగే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, నియోజకవర్గ ఇంచార్జి ఓడితల ప్రణవ్ బాబు కూడా ప్రజలకు అండగా నిలుస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని చెప్పారు. ప్రతి పేద ముస్లిం కుటుంబం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వం సంకల్పంతో రాష్ట్రవ్యాప్తంగా ఈద్ కానుకల పంపిణీ చేపట్టినట్లు వివరించారు.
ఈ కార్యక్రమం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని, మత భేదాలు లేకుండా అందరూ కలిసి



పండుగలను జరుపుకోవడం మన సంస్కృతికి ప్రత్యేకత అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న ప్రజలు ప్రభుత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేస్తూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో వీణవంక మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ నర్సయ్య, స్థానిక నాయకులు ఎండీ బాషుమియా, చంద్, సోహెల్, కంకణాల జగదీశ్వర్ రెడ్డి, ఎండీ రఫీ, అజ్జు, జులుఫుకర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.
పేదలకు అండగా నిలుస్తూ, వారి జీవితాల్లో వెలుగు నింపే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. రంజాన్ పండుగ స్ఫూర్తి అయిన సహనం, దాతృత్వం, సహాయ సహకార భావనను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

## రేపు మంథనిలో ఉచిత మెగా వైద్య శిబిరం

**కరపత్రం ప్రతినిధి మంథని మార్చి 20**
ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కిమ్స్ హాస్పిటల్స్ సహకారంతో శ్రీ సీతారామ సేవా సదన్, మంథని ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు . స్థానిక శ్రీ సీతారామ సేవా సదన్ ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీ సీతారామ సేవా సదన్ అధ్యక్షులు కె వి ఎల్ ఎన్ హరిబాబు, ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల గణపతి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ సహాయ కార్యదర్శి ప్రహ్లాద్ కోశాధికారి అంబ్రిష్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన హైదరాబాదులో నిపుణులైన డాక్టర్లు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులు పంపిణీ చేసి, అవసరమైన సలహాలు, సూచనలు



అందించనున్నారు. ముఖ్యంగా డాక్టర్ బి. సాయి ఫణి చంద్ర (సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్ & హెడ్ -- రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్స్), డాక్టర్ శ్వేతా పెండ్యాల (సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ & స్పైన్ సర్జన్), డాక్టర్ విశాల్ కుమార్ చిటీకేశి (సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్), డాక్టర్ నవ్యశ్రీ యనిగల్ల (కన్సల్టెంట్ పీడియాట్రిక్ హీమాటో ఆంకాలజిస్ట్ & ట్రాన్స్ప్లాంట్ ఫిజీషియన్), డాక్టర్ డిడ్డి హరిప్రకాష్ (సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ & ఆర్థ్రోస్కోపిక్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్), డాక్టర్ రోషన్ కుమార్ జైస్వాల్ (కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ & కాంప్లెక్స్ ట్రామా సర్జన్), డాక్టర్ నవ వికాస్ యు. కంటి అండ్ టీం (చీఫ్ సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్), డాక్టర్ గ. కిషోర్ గల్లా (కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్), డాక్టర్ శ్రీ వర్ధన్ జాస్తి (కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్), డాక్టర్ సాయి స్నేహిత వెలుగులేటి (కన్సల్టెంట్ యూరోగైనకాలజిస్ట్ & లాపరోస్కోపిక్ సర్జన్) తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచిత మందుల పంపిణీ కూడా జరగనుంది. పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక మార్గదర్శనం అందించనున్నారు. మంథని ప్రాంతవాసులు ఈ సదవకు ఆశయాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ను ఘనంగా సన్మానించిన తాపీ కార్మిక సంఘం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 20**
జమ్మికుంట పట్టణంలో సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందుతున్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్)ను తాపీ కార్మిక సంఘం ఘనంగా సన్మానించింది. పట్టణ పరిధిలోని నేతాజీ కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.
ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పట్టణ అభివృద్ధికి, ముఖ్యంగా కార్మికుల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ నాయకులు ప్రశంసలు కురిపించారు.
కార్యక్రమంలో మాట్లాడిన సంఘం అధ్యక్షుడు బిట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, "చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ నాయకత్వంలో జమ్మికుంట పట్టణం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. కార్మికుల సమస్యలను



అర్థం చేసుకుని వెంటనే పరిష్కరించేందుకు ఆయన ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు" అని తెలిపారు.
ఉపాధ్యక్షుడు ఇల్లందుల భద్రయ్య మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం అని పేర్కొన్నారు. మోలుగురి శ్రీను, మైస సాంబయ్య, మురళి, తిరుపతి తదితరులు కూడా చైర్మన్ సేవలను ప్రశంసిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, "కార్మికులు



సమాజానికి వెన్నెముక వంటివారు. వారి సంక్షేమం కోసం మున్సిపాలిటీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. మీ అందరి ఆశీస్సులు, సహకారంతో ఇంకా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తాను" అని అన్నారు.
కార్యక్రమం అనంతరం సంఘం సభ్యులు చైర్మన్‌తో కలిసి ఫోటోలు దిగుతూ ఆనందాన్ని వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు, సభ్యులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం మార్చి 21, 2026

# త్రైత సిద్ధాంత యుగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

- **క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్**
- **ప్రబోధ సేవా సమితి ఎల్కతుర్తి శాఖ అధ్యక్షుడు సదానిరంజన్ సిద్ధాంతి**



హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామం శ్రీ పశుపతినాథ్ దేవస్థానం ఆలయ అర్చకులు, ధూపదీప నైవేద్య సంఘం, ప్రబోధ సేవా సమితి ఎల్కతుర్తి శాఖ మండల అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ.. శ్రీ పరాభవ నామ సంవత్సర నూతన తెలుగు క్యాలెండర్‌ను హుస్నాబాద్ లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు అని చెప్పారు. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు 1978లో శ్రీ కాలయుక్తి నామ సంవత్సరంలో ప్రబోధాశ్రమాన్ని స్థాపించినప్పటి నుండి "త్రైత శకము" ప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుత శ్రీ పరాభవ నామ సంవత్సరంతో త్రైత శకము-48వ సంవత్సరంలోకి ప్రవేశించిందని చెప్పారు. యోగీశ్వరులు సమాజానికి శాస్త్రబద్ధమైన ఆత్మజ్ఞానాన్ని అందించేందుకు "త్రైత సిద్ధాంతం"ను ప్రతిపాదించి ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. భారతదేశంలో ఉన్న అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం సిద్ధాంతాలకంటే భిన్నంగా, పరమాత్మ, ఆత్మ, జీవాత్మ అనే మూడు ఆత్మలపై ఆధారపడి ఉన్న త్రైత సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టారని వివరించారు. యోగీశ్వరులు రచించిన "త్రైత సిద్ధాంత భగవద్గీత" గ్రంథం శ్రీకృష్ణుని నిజ భావాన్ని వివరిస్తూ విశిష్ట స్థానం సంపాదించిందని చెప్పారు. భగవద్గీతతో పాటు ఇతర దైవగ్రంథాలలోని జ్ఞానం ఏకరూపమైందని, ప్రజలు కులమతాలకు అతీతంగా దైవగ్రంథాలను అధ్యయనం చేయాలని ఆయన బోధించినట్లు తెలిపారు. బ్రహ్మ, కర్మ, భక్తి యోగాలపై వివరణలతో పాటు, ఆధ్యాత్మిక రహస్యాలను వెల్లడించే 100కు పైగా గ్రంథాలు, 200కు పైగా ప్రవచనాలను యోగీశ్వరులు సమాజానికి అందించారని చెప్పారు. "తెలుగు భాష దైవ భాష" అని ప్రకటిస్తూ, తెలుగు భాష గొప్పతనాన్ని చాటేందుకు ఆయన విశేష కృషి చేశారని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక రంగంలో 100కు పైగా గ్రంథాలను రచించిన ఏకైక వ్యక్తిగా యోగీశ్వరులను గుర్తిస్తూ, ఆయన నిర్మించిన ప్రబోధాశ్రమం మరియు సేవలను "తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్"లో నమోదు చేసి సత్కరించినట్లు తెలిపారు. మన పండుగలు గ్రంథం ద్వారా యుగాది పండుగ విశిష్ఠతను వివరించిన యోగీశ్వరులు, యుగాది నుండి ప్రకృతి, గ్రహాల ప్రభావం, మనిషి జీవనంలో మార్పులు సంభవిస్తాయని తెలిపారు. తెలుగు మాసాలు, తిథులతో కూడిన కాలసూచికను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, సరళమైన తెలుగు భాషలో రూపొందించిన ఈ క్యాలెండర్ ప్రతి ఒక్కరికీ పి ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏలిగేటి ఇంద్ర సేన రెడ్డి, ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ, పీసీసీ మెంబర్ బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, బావుపేట గ్రామ సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రటరీ మంద సుమన్ గౌడ్, యూత్ మండల అధ్యక్షులు, అంబాల శ్రీకాంత్, మార్కెట్ డైరెక్టర్స్ బచ్చు బాపు రావు, గోడిశాల రాజయ్య, బండి సుధాకర్, ముష్కే శ్రీనివాస్, పెంద్యాల భాస్కర్, రాజేష్ భక్తులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్ అణగారిన వర్గాలకు నయవంచన

- **ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బొంకూరి రాజు**




రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, ఇతర వెనుకబడిన వర్గాల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వం నయవంచన చేసిందని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు బొంకూరి రాజు విమర్శించారు. ఎల్కతుర్తి మండల కేంద్రంలో విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ.. పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం సాధనకు కీలకమైన విద్య, వైద్య రంగాలకు కనీసం మొత్తం బడ్జెట్‌లో 30 శాతం కేటాయించాల్సి ఉండగా, విద్యారంగానికి కేవలం 8.2 శాతం, వైద్య రంగానికి 4.2 శాతం మాత్రమేకేటాయించడం అత్యంత దురదృష్ట కరమన్నారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను బలహీనపరుస్తూ కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహించే విధంగా ఈ బడ్జెట్ ఉందని ఆయన ఆరోపించారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, బీసీ వర్గాలకు మొండి చేయి చూపిందని అన్నారు. ఈ బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలకు కూడా నామమాత్రపు కేటాయింపులే చేశారని, పశు సంవర్ధక శాఖకు ప్రతి సంవత్సరం కోతలు విధించడం వల్ల పాడి రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని పేర్కొన్నారు. రైతు కూలీలు, సన్నకారు రైతులకు అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం విస్మరించిందని, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి, నిరుపేదలకు పౌష్టికాహారం అందించే ఆహార భద్రత పథకాలకు ప్రత్యేక కేటాయింపులు లేకపోవడం విచారకరమని తెలిపారు. ప్రతి సంవత్సరం బలహీన వర్గాల అభివృద్ధి పేరుతో కేటాయించిన నిధులు సరైన విధంగా వినియోగం కాకుండా పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ వ్యవస్థకు మద్దతు ఇవ్వడం కాకుండా, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడే విధంగా ప్రభుత్వం సమగ్ర దృష్టి సారించాలని బొంకూరి రాజు డిమాండ్ చేశారు.

# ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బాలవికాస సమితి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

- **సూరారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో**



హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సూరారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలవికాస సమితి ఆధ్వర్యంలో "ప్రపంచ నీటి దినోత్సవం" కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాష బోయిన నీల, ఉపసర్పంచ్ మేకల బాబు, మాజీ సర్పంచ్ తక్కళ్లపెల్లి సంపత్ రావు (కబడ్డీ క్రీడాకారుడు) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీల కొంరయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు నీటి విలువ, దాని సంరక్షణ అవసరం, మంచి ప్రవర్తన మరియు సమాజంలో బాధ్యతతో జీవించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే సద్గుణాలు అలవాటు చేసుకోవాలని, నిజాయితీ, క్రమశిక్షణ, పరస్పర గౌరవం వంటి విలువలు భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చి దిద్దుతాయని అన్నారు. పాఠశాల హెడ్మాస్టర్ మాట్లాడుతూ బాలవికాస సమితి ద్వారా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సామాజిక చైతన్యం పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. టీచర్లు నీటి ప్రాముఖ్యతను కథలు, ఉదాహరణల ద్వారా విద్యార్థులకు వివరించగా, విద్యార్థులు ప్రసంగాలు, పాటలు, నాటికల ద్వారా నీటి విలువలను ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థి విద్యార్థినులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బాలవికాస సమితి కోఆర్డినేటర్లు బరిగల రమ, అలువాల శోభ, గుర్రం మహేశ్వరి, పుల్లా పద్మ, జనుగాని రమ, మహిళా సంఘాల సభ్యులు సింగనబోయిన ఇంద్ర పాల్గొన్నారు. విద్యార్థుల్లో మంచి అలవాట్లు, నైతిక విలువలు పెంపొందించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషించింది.

# డిసిసి కార్యదర్శిగా బుడ్డ భాగ్యరాజ్ నియామకం

కరపత్రం ప్రతినిధి చేగుంట ప్రతినిధి మార్చ్ 20



మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక నియామకం చోటుచేసుకుంది. పార్టీ బలోపేతం లక్ష్యంగా, లయన్ బుడ్డ భాగ్యరాజ్ ను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమిస్తూ టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ పి. మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో జిల్లాలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన లయన్ బుడ్డ భాగ్యరాజ్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, సీనియర్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు, గారికి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "మీ ప్రేమే నా బలం -- మీతో ఈ బంధమే నా ఊపిరి. మీ అందరి ఆశీస్సులతో మరింత బాధ్యతగా, శక్తివంతంగా పనిచేస్తాను. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను" అని ఆయన స్పష్టం చేశారు.
అలాగే జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమితులైన ~వీజ మాజీ చైర్మన్ రజనకు, ప్రవీణ్ కుమార్‌కు కూడా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ నియామకం ద్వారా మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు లభిస్తుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కుక్కల బెడద నుండి జింకను కాపాడిన అంగడి చిట్టెంపల్లి గ్రామస్తులు

కరపత్రం ప్రతినిధి పూడూరు



పూడూరు మండలం అంగడి చిట్టంపల్లి గ్రామ పరిధిలో ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోకి వచ్చిన జింకను కొన్నీ కుక్కలు తరుముతూ ఉండగా స్థానికులు వెంటనే కుక్కల బెడద నుండి జింకను రక్షించడం జరిగింది. అనంతరం సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా వారు తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకుని జింకను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. జింకకు అవసరమైన వైద్య చికిత్స అందించేందుకు ఫారెస్ట్ అధికారులు చర్యలు చేపట్టారు. అడవి జంతువుల పై ఉన్న ప్రేమతో గ్రామ ప్రజలు తమ మానవత్వాన్ని చాటుకున్నారు. అడవి జంతువులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అనే విషయాన్ని ఈ సంఘటన మరొకసారి గుర్తు చేస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిద్ధన్న గారి యాదవ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పరిచయమే 'ప్రత్యేకత'ను కలిగిస్తుంది.

- **తన మాటలతో ఆహ్లాదం, ఆనందాన్ని పంచుతున్న 'కొలె దామోదర్రావు' స్వగ్రామంలో కమిటి హాల్ నిర్మాణానికి రూ.2లక్షల స్థలం వితరణ పాత్రికేయులు, సంఘ సేవకులుగా సేవలందిస్తున్న దామోదం**





కొంత మంది పరిచయం మనలో ఎంతో కొంత అసౌకర్యాన్ని కలిగిస్తుంది. కానీ మరి కొందరి పరిచయం మనలో ఆనందాన్ని, ఉత్సాహాన్ని నింపుతుంది. ఈయన మన మిత్రుడే... శ్రేయోభిలాషే అనే విధంగా మన జీవితంలో ఈ వ్యక్తి పరిచయం ఎప్పటికీ ప్రత్యేకంగా ఉండేలా నిలుస్తుందంటే అతిశయోక్తి కాదు. ఆ కోవలోకే వస్తారు 'పాత్రికేయులు, సంఘ సేవకులు 'కొలె దామోదర్రావు'. కేవలం కష్టాలను మాత్రం తాను భరిస్తూ... ఆనందాలను పది మందికి పంచుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో మంచి గుర్తింపు సొంతం చేసుకున్న 'కొలె దామోదర్రావు గురించి జన సముద్రం న్యూస్ ప్రత్యేక కథనం. తన 14 సంవత్సరాల సుదర్ఘీ ప్రస్థానంలో పాత్రికేయులుగా ఎటువంటి మచ్చలేకుండా రాణిస్తున్నారంటే ఆయన మాట, మర్యాద, మంచితనమే. ఎవరైనా మన 'దామన్న' అన్న అని ఆప్యాయంగా పలుకరిస్తూ అక్కున చేర్చుకుంటారు. హన్మకొండ జిల్లాలోని కమలాపూర్ మండల వాస్తవ్యులైన 'కొలె దామోదర్రావు, కమలాపూర్తో పాటు భద్రాచలంలోనూ ఎక్కువ సుపరిచితులే. చిత్రపతి శివాజీ అంటే ప్రాణమిచ్చే దామన్న తన స్వగ్రామంలోని దేశరాజ్పల్లిలో సుమారు 2లక్షల రూపాయల విలువైన స్థలాన్ని సైతం ఆరె కుల సంఘం కమిటికి ఇచ్చినారు. చత్రపతి శివాజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేందుకు నిరంతరం కృషి చేస్తుంటారు. పది మందికి సహాయ పడాలనే తాపత్రయం అధికంగా ఉన్న దామన్న కోతులకు అరటి పండ్లు పంపిణి దగ్గరి నుంచి, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, మహిళలకు ప్రతి ఏడాది ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించడం, వృద్ధులకు అన్నదానం చేయడం వంటివి చేస్తుంటారు. నలుగురికి సహాయడంలో ముందు వరుసలో ఉంటారు. భద్రాచలంలో నివాసం ఉండే దామోదర్రావు భద్రాద్రి రామయ్య దర్శనానికి తన స్వస్థలం నుంచి ఎవరు వచ్చినా వారికి దగ్గరుండి రామయ్య దర్శనం చేయించి, పాపి కొండల వివాహా యాత్రకు సైతం తీసుకెళ్ళి భద్రాచలం, పర్ణశాల, పాపి కొండల విశిష్టతను వారికి తెలియజేస్తుంటారు. మన కష్టాలను ఎవరికీ చెప్పకూడదు.... ఒకరి విషయాల పట్ల మనం తలదూర్చకూడదని చెబుతూ తాను ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక దారిలో నడుస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తుంటారు. మాటల మాంత్రికుడిగా పేరుగాంచిన కొలె దామోదర్రావు తన పలకరింపులతోనే ఎదుటివారిలో ఉన్న బాధను కొంత మేర అయిన దూరం చేసి ఆహ్లాదాన్ని అందిస్తాడంటే అతిశయోక్తి కాదు. 'ప్రతి ఉదయం' అను పత్రికను సొంతంగా నిర్వహిస్తున్న కొలె దామోదర్రావు తెలంగాణ బిసి సంక్షేమ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులుగా, ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, శ్రీరామదీక్ష సేవా సమితి ప్రధాన కార్యదర్శిగా, భద్రగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా విశిష్టమైన సేవలందిస్తూ ఇప్పటికీ నవ యువకునిగా పరుగులు. పెడుతూ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

# ముస్లిం సోదరులకు రేవంతన్న కానుక గ్రామంలో పంపిణీ చేసిన సర్పంచ్ శ్వేత శివకుమార్

నారాయణపేట జిల్లా మార్చి 20, కరపత్రం ప్రతినిధి



ముస్లిం సోదరుల పట్ల సౌహార్ద భావంతో, రేవంతన్న కానుక కార్యక్రమం భాగంగా గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కానుకల పంపిణీ నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్వేత శివకుమార్ ముఖ్యంగా పాల్గొని ముస్లిం సోదరులకు కానుకలు అందజేశారు. ఉప సర్పంచ్ లాలప్ప, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గోపాల్ నాయకులు, పెరుమాళ్ళు, సాయిలు, బాలరాజ్, అలాగే మైనార్టీ నాయకులు కశిం, మాకబౌల్, మహమూద్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ముస్లిం సోదరులకు అందిస్తున్న ఈ కానుకలు పరస్పర సౌహార్ద్రాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.